

ఎన్నికల విధులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల విధివిధానాలు, విధులు పట్ల పోలీస్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల విభాగపు పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసే వరకు పోలీసుల పాత్ర- విధులు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికలలో అక్రమాలకు అడ్డుకట్ట, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, దిశా విక్రమ్ , ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అదనపు పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 1500 ఓటర్లకు మించి ఉంటే ఆ పోలింగ్ కేంద్రానికి అనుబంధంగా మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలియజేశారు. మంగళవారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ కొండయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి వంశీకృష్ణ, మడకశిర గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామన్నారు. రాజకీయ పార్టీలు ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సలహాలు సూచనలు అందజేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సంఖ్యను అనుసరించి జిల్లాలో 1561 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఎక్కడైనా ఓటర్ల సంఖ్య 1500 దాటితే ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అనుబంధ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల సిబ్బంది తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఎన్నికల విధుల నిర్వహణకు ఎలాంటి కొరత లేకుండా సిబ్బందిని నియమించామన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు మార్పులు చేర్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒకే కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు త్వరలో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వర్క్ షాప్ నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పుపై 10 అభ్యంతరాలు వచ్చాయని పేరు మార్పుపై 94 ప్రతిపాదనలు వచ్చాయని వాటిని సంబంధిత ఎన్నికల అధికారులకు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సిపిఎం పైపల్లి గంగాధర్, బీఎస్పీ గోవిందు, సుబ్బరాయుడు, ఆమ్ఆద్మీ దండు నాగరాజు, కాంగ్రెస్ ప్రతినిధి పొట్ల గంగాద్రి, టిడిపి ప్రతినిధులు సామకోటి ఆదినారాయణ, మనోహర్, సిపిఐ ఆంజనేయులు, జనసేన అబ్దుల్, బిజెపి అమర్, డిప్యూటీ తహశీల్దార్ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

టిడిపిలో ఆగని లుకలుకలు



ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపిలో లుకలుకలు తగ్గడం లేదు. అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచి మూడు నియోజకవర్గాల్లో అసమ్మతి నేతల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది. ఇవి రోజురోజుకు అధికం అవుతూనే ఉన్నాయి. అసమ్మతి నేతలతో అధిష్టానం ఎంత మట్లాడినా ఫలితం దక్కడం లేదు. శింగనమల, కళ్యాణదుర్గం, మడకశిర నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థిని మార్చాలంటూ బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు.



- మడకశిరలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట తమ్ముళ్ల నిరసన
- బండారు శ్రావణికి మద్దతునివ్వనన్న కేశవరెడ్డి
- కళ్యాణదుర్గంలోనూ అసమ్మతి రాగం
- గుంబనంగా పెనుకొండ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పది రోజుల క్రితం టిడిపి అధిష్టానం ఉమ్మడి జిల్లాలో 9 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో మడకశిర, కళ్యాణదుర్గం, శింగనమల, పెనుకొండ నియోజకవర్గాల్లో అభ్యర్థులపై అసమ్మతి నేతలు ఆక్రోశం వెల్లగక్కారు. అభ్యర్థులను మార్చాల్సిందే అంటూ వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. పార్టీ ముఖ్య నేతలను కలిసి తమ నిరసన గళాన్ని విన్పిస్తున్నారు. మడకశిర, శింగనమలలో గత రెండు ఈ అసమ్మతి సెగ మరింత ఎక్కువ అయినట్లు కన్పిస్తోంది.

మడకశిర అభ్యర్థిని మార్చాల్సిందే..!

మడకశిరలో అభ్యర్థి సునీల్ కుమార్‌ను మార్చాలంటూ పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం నాడు నిరసనకు దిగారు. మార్చకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని అల్టిమేటం కూడా ఇచ్చారు. ఏకంగా ఓ కార్యకర్త ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిరసన తెలిపాడు. మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్ కుమార్‌కు అధిష్టానం టిక్కెట్టును ఖరారు చేసింది. ఈయనకు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిల మధ్య ముందు నుంచి పొసగడం లేదు. దీంతో తిప్పేస్వామి మద్దతుదారులు సునీల్‌కుమార్‌ను మార్చాలని పట్టుబడుతున్నారు. మార్చకుంటే ఆత్మహత్యలే శరణ్యమని మడకశిర పట్టణంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు.

శింగనమలలో కుదరని సఖ్యత

శింగనమల అభ్యర్థిగా బండారు శ్రావణికి అధిష్టానం పార్టీ టిక్కెట్టు ఖరారు చేసింది. ఈమెకు ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడులు మధ్య పొసగడం లేదు. గతంలో ఆమెను నియోజకవర్గ ఇన్‌ఛార్జి నుంచి తొలగించి టూమెన్ కమిటీ పేరుతో వారికి బాధ్యతలు అప్పగించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం బండారు శ్రావణికే అధిష్టానం టిక్కెట్టును ఖరారు చేసింది. ఈ నిర్ణయం తరువాత ఆమె ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డిని తన అనుయాయులను వెంట బెట్టుకుని కలిసేందుకు వెళ్లారు. ఈ సమయంలో జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషియల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆడపిల్లను ..మీ అంతటి రాజకీయ అనుభవం లేదు... తనకు మద్దతునివ్వాలంటూ.' బండారు శ్రావణి టిడిపి నాయకులు కేశవరెడ్డిని కోరారు. అయితే కేశవరెడ్డి మాత్రం తాను మద్దతునివ్వనని తేల్చి చెప్పడం గమనార్హం. 'నా సొంత తమ్ముడిపై కేసు పెట్టావు... నేను నీకు ఏ రకంగా మద్దతునివ్వాలి... నేను ఇవ్వలేను.' అని కేశవరెడ్డి చెప్పడం ఆ వీడియోలో ఉంది. యువగళం సమయంలో అక్కడ జరిగిన ఘటనను మాత్రమే పోలీసులకు రాతపూర్వకంగా ఇచ్చానని శ్రావణి సర్దిజెప్పే ప్రయత్నం చేసినా కేశవరెడ్డి వినలేదు. కాంగ్రెస్ హయాంలో శైలజనాథ్ మంత్రిగా ఉన్నప్పుడు హత్య కేసు పెట్టినా భయపడలేదు.. నీ కేసుకు ఏంది భయపడేది... అని కేశవరెడ్డి చెప్పడం అందులో కనిపించింది.

కళ్యాణదుర్గంలోనూ అసమ్మతి రాగం..

కళ్యాణదుర్గం టిడిపిలోనూ అసమ్మతి రాగం కన్పిస్తోంది. కళ్యాణదుర్గం టిడిపి టికెట్టు తమకు కావాలంటే తమకు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడులు పట్టుబడుతూ వచ్చారు. అయితే అధిష్టానం కొత్త అభ్యర్థిగా అమిలినేని సురేంద్రబాబుకు టికెట్టును ఖరారు చేసింది. టికెట్టు ఖరారు అయినప్పటి నుంచి సురేంద్రబాబు తాను అందరినీ కలుపుకుని వెళ్తానని పదేపదే చెబుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నాడు అమిలినేని సురేంద్రబాబు మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి ఇంటికెళ్లి కలసిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని కోరినట్టు పొటోలొచ్చాయి. అయితే ఇద్దరి మధ్య ఏ విధమైన సంభాషణ జరిగిందన్న విషయం తెలియలేదు.



మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరితో మాట్లాడుతున్న అమిలినేని సురేంద్రబాబు



మడకశిర టిడిపి అభ్యర్థిని మార్చాలని కోరుతూ మడకశిరలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలుపుతున్న టిడిపి కార్యకర్త

గుంబనంగా పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం టిడిపిలోనూ పరిస్థితి గుంబనంగానే కన్పిస్తోంది. ఇక్కడ నుంచి టికెట్టు తనకే అని ధీమాగా ఉన్న టిడిపి శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారధి స్థానంలో అధిష్టానం సవితమ్మకు టికెట్టు ఖరారు చేసింది. అప్పటి నుంచి బికె మద్దతుదారులు అధిష్టానంపై గుర్రుగానే ఉన్నారు. ఇటీవల రా..కదిలిరా.. కార్యక్రమం నిర్వహణ సందర్భంగా బికె ఇంటికి వెళ్లిన జిల్లా, పెనుకొండ నియోజకవర్గ పరిశీలకులను బికె మద్దతుదారులు అడ్డుకుని నినాదాలు చేశారు. అయితే బికె.పార్థసారధి మాత్రం అధిష్టానంపై ఎక్కడా అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. టికెట్టు విషయంలో మాత్రం ఇప్పటివరకు సవితమ్మ, పార్థసారధి గ్రూపులు ఎడమోహంగానే ఉంటున్నాయి. ఇలా నాలుగు నియోజకవర్గాల్లోనూ టిడిపి అభ్యర్థులకు వ్యతిరేకంగా లుకలుకలు బాహాటంగానే కన్పిస్తున్నాయి. ఎన్నికల సమయం ఆసన్నమవుతున్నా అసంతృప్తులు కొనసాగు తుండడం ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళాన్ని నింపుతోంది.

ధర్మవరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నేనే : పరిటాల శ్రీరామ్



సభలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేది తానే అని పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మండల పరిధిలోని రావులచెరువు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ధర్మవరంలో టిడిపి జెండా ఎగురు వేసేది కూడా తానే అని అన్నారు. ఎవరో మాట్లాడే గాలి మాటలు అసలు పట్టించుకోవద్దని ఎలాంటి అనుమానాలకు తావు ఇవ్వరాదని అన్నారు. ధర్మవరంలో ఎలాంటి గందరగోళానికి తావు లేదని కచ్చితంగా ఈసారి టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ ఎంపీపీ కొనుటూరు వేణుగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ జెడ్పీటీసీ మేకల రామాంజనేయులు, చెన్నారెడ్డి, భాస్కర చౌదరి, అశ్వత్థ నాయుడు, భాస్కర్ రెడ్డి, సర్పంచి ముత్యాలప్ప నాయుడు, పాలెం వెంకటేశు, బిల్వంపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మహిళలు, చిన్నపిల్లలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు ఇటీవల కాలంలో అధికమయ్యాయని వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ విమర్శించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దిల్షాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు, చిన్నపిల్లలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. మహిళలపై అఘాయిత్యాలపై రాష్ట్రం నాల్గవ స్థానంలో ఉందన్నారు. ఈ దాడులకు ముఖ్యకారణంగా ఉన్న మద్యాన్ని నియంత్రించాలని, సినిమాల్లో, య్యూటూబ్లో నీలిచిత్రాలను నియంత్రించాలని, చదువుకున్న యువతకు ఉపాది కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాబోవు రోజుల్లో ఎస్ఎఫ్ఎ, సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ జిల్లా కార్యదర్శి నాగార్జున, సిఐటియు మండల అధ్యక్షులు ఎల్ ఆదినారాయణ, మండల నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్





నేడు భువనేశ్వరి..7న లోకేష్ రాక

ప్రజాశక్తి-అనంతపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి ముఖ్య నాయకుల పర్యటనలు పెరిగాయి. ఒకరి తరువాత ఒకరు ముఖ్య నేతలు పర్యటిస్తున్నారు. ఈ నెల 4వ తేదీన పెనుకొండలో జరిగిన రా..కదిలిరా సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. తాజాగా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో చేపట్టిన యాత్రలో భాగంగా బుధవారం నాడు కళ్యాణదుర్గం, కణేకల్లు మండలాల్లో పర్యటించనున్నారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని కొండాపురం, ముద్దినాయనపల్లి, కణేకల్లు మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ గ్రామాల్లో చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా మరణించిన టిడిపి కార్యకర్తల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్థిక సాయం అందించనున్నారు. ఇక ఈ నెల 7వ తేదీన శంఖారావం కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో టిడిపి శ్రేణులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

7న మీడియా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం

ప్రజాశక్తి-అనంతపురం

సాధారణ ఎన్నికలు-2024పై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఈ నెల 7వ తదీ మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో భవనంలో ఎంసిఎంసి (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ), పెయిడ్ న్యూస్, తదితర అంశాలపైశిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులైన బ్యూరోలు, స్టాపర్లు, ఎడిషన్ ఇన్‌ఛార్జులకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని డిఆర్ఒ కొండయ్య కోరారు.

మండల కేంద్రానికి చేరిన 'పది' పరీక్ష ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి - లేపాక్షి

పదోతరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు మండలకేంద్రానికి మంగళవారం చేరాయి. పదవతరగతి సెట్ 1 ప్రశ్నాపత్రాలు రావటంతో వాటిని అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఇఒ నాగరాజు నాయక్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కుళ్లాయప్ప, హెచ్ఎం గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు నమస్కరిస్తున్న కందికుంట యశోదమ్మ

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

కదిరి టౌన్ : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంటవెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ అన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవ, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని గౌనిపల్లిలో భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒడిసి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవి రూరల్ ఆర్ట్ఆర్గనైజేషన్ కళాజాత వారు బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలకు అర్థమయ్యే విధంగా పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచి మేనేజర్ రవికాంత్, ఫీల్డ్ ఆఫీసర్ పార్థసారథి, బిజినెస్ సీఎస్పీ పాయింట్ గౌన్ పల్లి నరేంద్ర, బ్యాంక్ సిబ్బంది, కళా జాతా బృంద సభ్యులు చిరంజీవి, సింగర్ విజయ్, వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆనాటి పరిస్థితులకు అద్దంపట్టే నవల 'భానుమతి'

ప్రజాశక్తి-హిందూపురం

స్వాతంత్రానికి పూర్వం నాటి సాంఘిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను భానుమతి నవల చక్కగా ప్రతిబింబించిందని దక్షిణ భారత హిందీ ప్రచార సభ అధ్యక్షులు పోలిశెట్టి ఓబయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1930 లో ఎంవి పాపన్న గుప్త రచించిన భానుమతి నవలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానాచార్యులు డా.యం. ప్రగతి మాట్లాడుతూ పాపన్న గుప్తా ప్రస్తావించిన అనేక సమస్యలు ఈనాటికీ అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాపన్న గుప్త కుమారుడు యం.వి. మోహన్, మదనపల్లి రచయిత టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, సడ్లపల్లి చిదంబర రెడ్డి, అనంతపురం ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ అంకె శ్రీనివాసులు, మహిళా డిగ్రీ కళాశాల హిందీ ఉపన్యాసకులు డాక్టర్ యశోద దేవి, కల్లూరు రాఘవేంద్ర రావు, సిద్దగిరి శ్రీనివాస్, సాహితీవేత్తలు మాట్లాడారు. ఓబయ్య నవలా రచయిత పాపన్న గారి తో తనకు గల అతి సామీప్య పరిచయ నేపథ్యాన్ని గుర్తు చేసుకున్నారు. అదే విధంగా చిదంబర రెడ్డి ఓబయ్య గారి ద్వారా తాను పొందిన సహాయ సహకారాలను గుర్తు చేస్తూ ఆనాటి మనుషుల మనసుల నిర్మలత్వాన్ని, ఉదార స్వభావాన్ని వివరించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు డా. అంకె శ్రీనివాసులు భానుమతి నవలను పరిచయం చేస్తూ ఆనాటి సాంఘిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను, ఈనాటి వ్యవస్థలో ఉన్న పరిస్థితులతో పోల్చారు. అనంతరం కవులను, రచయితలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హేమ మారుతి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీలక్ష్మి, సుమంగళి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ప్రత్యేక వైద్యచికిత్సలు



మాట్లాడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య చికిత్సలను అందిస్తామని శ్రీ సత్య సాయి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కేశవ నగర్ లోని గుద్దిటి సోమదాస్ నిలయంలో (వైట్ హౌస్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలా ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణంలోని ఎనిమిదవ వార్డులో 200 మంది వృద్ధులు పెన్షన్ పొందుతున్నారని అన్నారు. వారిలో మొదటి గ్రూపులో గల 25 మందిని బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలతో బాధపడేవారు, లేదా బిపి షుగర్, హిమోగ్లోబిన్ లోపంతో బాధ పడేవారు గ్రూపుగా చేసి 15వ తేదీ లోపు వారికి ఒకరోజు రక్త పరీక్షల క్యాంపును నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ క్యాంపును నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపులో 25 మందికి మోకాలు పట్టలు, హిమోగ్లోబిన్ తినకముందు తిన్న తర్వాత రక్త పరీక్షలు, కిడ్నీ సమస్యలు తెలుసుకోవడానికి సీరం క్రియాటినైన్, పెయిన్ కిల్లర్ క్రీము, అరటిపండు, మజ్జిగ గుగ్గులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుద్దుటి సోమదాసు, డాక్టర్ సత్యనిర్ధారన్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ప్రతిచోటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మంగళవారం గోకులం డోక్రా బజార్ దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత రానురాను పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భూమి గాని రాజశేఖర్ యాదవ్, నియోజకవర్గ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి రామాంజనేయులు, నారాయణస్వామి, పోతలయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 'పురం' విద్యార్థి ప్రతిభ

హిందూపురం : పట్టణంలోని అల్ అమీన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో చదువుతున్న ఆరవ తరగతి విద్యార్థి అనస్ జిల్లా స్థాయి కరాటేలో పోటీల్లో జిల్లా ఛాంపియన్‌షిప్ సాదించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ రియాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పాఠశాలలో విద్యార్థి అనస్ కు అభినందించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతు రెండు రోజుల క్రితం గుంతకల్లులో జరిగిన జిల్లా ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి అనస్ పాల్గొనిమంచి ప్రతిభ కనబర్చడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం న్యామతున్నీసా,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

పరిగి : మండల కేంద్రంలోని బీర లింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో మండల ఎంపీపీ సవిత ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పలువురు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వైసీపీలోకి చేరారు. వీరికి మంత్రి ఉషశ్రీ చరణ్ పార్టీ కండువా వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. జగన్మోహన్ రెడ్డి పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలోకి వస్తున్నారని వారికి తమ అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, జడ్పిటిసి శ్రీరాములు, మారుతిరెడ్డి, రమణ, సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

నల్లచెరువు : మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి.సిద్దారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఏదో వంకతో జగన్ పై బురద చల్లాలని చూస్తున్నారన్నారు. వీటన్నిటినీ ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో రాణమ్మ, తహశీల్దార్ రవికుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వందశాతం పల్స్‌పోలియో

పుట్టపర్తి రూరల్ : పల్స్‌పోలియోను వందశాతం విజయవంతం చేయాలని డిఎంహెచ్ఒ క్రిష్ణారెడ్డి ఆదేశించారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బత్తలపల్లి,పెడపల్లి పుట్టపర్తి లోని గోకులంలో మంగళవారం నిర్వహిస్తున్న పల్స్‌పోలియో ఇంటింటి సర్వేను డిఎంహెచ్ఒ పరిశీలించారు. తల్లిదండ్రులు ఆరోగ్య వంతమైన జీవితాన్ని తమ పిల్లలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమములో సిహెచ్ఒ నగేష్, లలిత కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట రమణ చంద్రకళ, రాధ, ఆరోగ్య కార్యకర్తలు సుహాసిని, జ్యోతి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ తిప్పయ్య పరిశీలించారు. అనంతరం ఆయన పిహెచ్‌సిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కల్పన, డాక్టర్ అలేఖ్య, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, లెప్రసీ అధికారి రెడ్డి కుమార్ రెడ్డి, సూపర్వైజర్లు భారతి సుధాకర్, ఎల్‌టి శంకర్, ఫార్మసిస్ట్ చిన్నయ్య, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ రెడ్డి, ఎఎన్ఎం యోగేశ్వరి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి కార్యదర్శిగా సురేంద్రరెడ్డి

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా సురేంద్రరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న గోపాల్ మెడికల్ లీవ్ పై వెళ్లడంతో మైల సముద్రం పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పంచాయితీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

10న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 10వతేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, ఉపాధ్యక్షులు నరేంద్రరెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక సాంస్కృతిక మండలిలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచిత కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రసన్నకుమార్, నాగభూషణ, సోలిగాళ్ల వెంకటేశ్, శివయ్య, హరినాథ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యకోసం దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్ : ప్రభుత్వం ఆర్టీఈ 121 సిలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతి విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఉచిత విద్య కోసం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు గోపాల్ నాయక్, రాజేశ్వరి దేవి తెలిపారు. ఈ నెల నాలుగవ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనాథ పిల్లలకు, హెచ్ఐవి ప్రభావితులకు ఐదు శాతం సీట్లు, షెడ్యూల్ కులాల వారికి 10 శాతం, షెడ్యూల్ తెగల వారికి నాలుగు శాతం, బలహీన వర్గాలకు, మైనారిటీలకు 6 శాతం సీట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఉత్తమ డ్రైవర్లకు అభినందన

ధర్మవరం టౌన్ : ధర్మవరం ఆర్టీసీ డిపో జిల్లాలో మంచి గుర్తింపును పొందింది. ఈ సందర్భంగా ప్రతి నెల అత్యధిక డీజిల్ ఆదా చేసిన వారిని డిపో మేనేజర్ సత్యనారాయణ అభినందిస్తూ ప్రోత్సహిస్తూ ఉన్నారు. ఇందులో భాగంగానే ఫిబ్రవరి నెలలో అత్యధిక డీజిల్ ఆదాచేసిన డ్రైవర్లు వి. ఆంజనేయులు, ఎం. నారాయణ, వైవి. రాముడును డిపో మేనేజర్ సత్యనారాయణ తో పాటు ఇతర అధికారులు అభినందించారు. వి.ఆంజనేయులు 34.79 లీటర్లు, ఎం. నారాయణ-115 లీటర్లు, వైవి.రాముడు 83 లీటర్లు ఆదా చేశారని డిపో మేనేజర్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గోరంట్ల రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి ప్రజల నుండి వస్తున్న దరఖాస్తులను వెంటనే నమోదు చేయాలని ఎంపీడీవో ఎం జి ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలంలోని మలసముద్రం గ్రామపంచాయతీ సచివాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సరిదిద్దలేని పొరపాటు'.!



గ్రామస్తులు, పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

సప్లిమెంటరీ నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే 'పది' పరీక్షలు : ఎంఇఒ సల్మాన్‌రాజ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్ష కేంద్రాన్ని ప్రయివేటు పాఠశాలకు తరలించడంలో సరిదిద్దలేని పొరపాటు జరిగిందని సప్లిమెంటరీ నుంచి పరీక్షలు ప్రభుత్వ పాఠశాలలోనే నిర్వహిస్తామని ఇందుకు గ్రామస్తులు సహకరించాలని ఎంఇఒ సల్మాన్‌రాజ్ కోరారు. పది పరీక్షకేంద్రం మార్పుపై మండలంలో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఆందోళన చేసేందుకు పూర్వ విద్యార్థులు పిలుపు నివ్వడంతో మరోసారి మండల విద్యాశాఖ అధికారులు పూర్వ విద్యార్థులతో చర్చలకు పిలిచి సామరస్యంగా సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. ఇందుకు ఎస్ఐ గంగాధర్ చొరవ చూపడంతో చర్చలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఇఒ సల్మాన్‌రాజ్ మాట్లాడుతూ హెచ్ఎం తెలియనితనం వల్ల సెంటర్ వద్దని చెప్పడం, డ్యూయల్ డెస్క్‌లు లేవని చెప్పడం వల్ల సెంటర్ మార్చారని చెప్పుకొచ్చారు. ఇక్కడ తప్పు జరిగిపోయిందని,ఇప్పుడు దానిని సరిచేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పరీక్ష కేంద్రం ప్రయివేటు పాఠశాల అయినప్పటికి విద్యార్థులకు అనుకూలంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ప్రయివేటు పాఠశాలకు చుట్టూ ప్రహరీ కూడా లేదని ఎలా రెండు సెంటర్లు ఇస్తారని పూర్వ విద్యార్థులు ఎంఇఒను నిలదీశారు. దీంతో ఎంఇఒ మాట్లాడుతూ పొరపాటు జరిగిందని అన్నారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చుట్టు బారికేట్లు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులకు అనుకూలంగా బస్సులు,కనీస వసతులు, అక్కడే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ పొరపాటును వచ్చే సప్లమెంటరీ పరీక్షల నుండే సరిదిద్ది ప్రభుత్వ పాఠశాలలోనే పరీక్ష కేంద్రం నిర్వహిస్తామని హామి ఇవ్వడంతో పూర్వ విద్యార్థులు అంగీకరించారు. ఇక విద్యార్థులకు పరీక్ష ప్రయివేటు కేంద్రంలో అన్న భయం పోగొట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -1 పద్మప్రియ ఎంఇఒ -2 సల్మాన్ రాజ్, పూర్వ విద్యార్థులు అలీముల్లా, బాలాజీ, సుబ్రమణ్యం, రవికుమార్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

మడకశిర : మండలంలోని చీపులేటి గ్రామం సమీపంలో ఈనెల 7న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టబోయే శంఖారావం సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న, నియోజకవర్గ టిడిపి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల4న పెనుకొండలో నిర్వహించిన చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 7న నిర్వహించే శంఖారావం సభకు నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెనుకొండ : టీడీపీ యువనేత నారా లోకేష్ బాబు శంఖారావ సభ ను విజయవంతం చేద్దామనితెలుగుదేశం,జనసేన పార్టీ ఉమ్మడి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెనుకొండలో నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేసినందుకు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిదంగా యువనేత లోకేష్ ఈనెల 7న పెనుకొండలో నిర్వహించే శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ గిరిజన జనగర్జన పోస్టర్లు ఆవిష్కరణ

పెనుకొండ : ఈ నెల 10 వ తేదీన పుట్టపర్తి వేదికగా నిర్వహించే వైసీపీ గిరిజన జనగర్జన పోస్టర్లను మంత్రి ఉషశ్రీ చరణ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంజారా సంఘ నాయకులతో కలిసి మంత్రి కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గిరిజనులకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం మన వైఎస్సార్సీపీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి గిరిజ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ఎమ్మెల్యే దుద్దుకుంట స్వగ్రామమైన నల్లశింగయ్యగారి పల్లి లో వైసిపి గిరిజన గర్జన పోస్టర్లను పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 10న పుట్టపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం ముందు గల ప్రాంగణంలో జరిగే వైసిపి గిరిజన గర్జన కార్యక్రమానికి గిరిజన సోదరులు హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దుంగవత్ రమేష్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు పెడపల్లి తిరుపాల్ నాయక్, గోరంట్ల సర్పంచి సరోజా నాగే నాయక్, గిరిజన సంఘం నాయకులు రవి నాయక్, గిరిజన సంఘ నాయకులు ప్రజాప్రతినిధులు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, తదితరులు



టిడిపి నాయకులు, కార్యకర్తల నిరసన ర్యాలీ

మడకశిర టిడిపి అభ్యర్థిని మార్చాల్సిందే...

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్‌ను మార్చాలని పట్టణంలో మంగళవారం ఓ వ్యక్తి కిరోసిన్ ఒంటిపై పోసుకొని నిప్పు పట్టించుకునేందుకు యత్నించాడు. నియోజకవర్గ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వందలాదిమంది తెలుగుదేశం పార్టీ నాయకులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి ఇంటి నుండి టిడిపి నాయకులు బయలుదేరుతుండగా చంద్ర అనే వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకోవటానికి ప్రయత్నించగా అక్కడ ఉన్నవారు వారించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చంద్రతో మాట్లాడి అతని చర్యలను వారించారు. అనంతరం నాయకులు ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి ఇంటి నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

నిందితులపై పోక్సో కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మంగళకర విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ నిందితులపై చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నళ్ళజోడు పవన్, సహాయ కార్యదర్శి అరుణ్, ఉపాధ్యక్షులు మహేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అధ్యాపకుడే విద్యార్థినులను లైంగికంగా వేధించడం అమానుషమన్నారు. ఈ విషయం పుట్టపర్తిలో కలకలం రేపిందని, కీచక అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులపై సమగ్ర విచారణ చేపట్టి పోక్సో యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, జగదీష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలే అభ్యర్థి విజయానికి సోపానాలు

ప్రజాశక్తి మడకశిర

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలే అభ్యర్థి విజయానికి సోపానాలని వైసిపి ఎన్నికల పరిశీలకులు అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంతి గృహంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ పార్టీ క్యాడర్ సమావేశానికి హాజరైన పోకుల అశోక్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు మల్లు ప్రసాద్ రెడ్డి, మాట్లాడుతూ రానున్న ఎన్నికల గురించి నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మడకశిరలో వైసిపి జెండా ఎగరవేయడానికి అందరు సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, వైటి ప్రభాకర్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, నళిని రంగే గౌడ్, పుట్టకామప్ప, గోవర్ధన్ రెడ్డి , జిబి శివకుమార్, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలపై అవగాహన

పుట్టపర్తి రూరల్: సాధారణ ఎన్నికలపై రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సంబంధిత శాఖలకు అవగాహన కార్యక్రమాన్ని ఆర్‌డిఒ భాగ్యరేఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల్లో పనిచేసే వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఏ.వేణుగోపాల్, కళావతి, భారతి, నాగభూషణం, రామ్‌నాథ్‌రెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలంబడి

ముదిగుబ్బ : మండలంలోని మంగళమడక , రామస్వామి తండా గ్రామాలలోని రైతుల పొలాల్లో వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పాటించాల్సిన వ్యవసాయ సాగు పద్ధతుల గురించి అధికారులు రవి, లక్ష్మి నరసింహులు, షరీఫ్ తదితరులు రైతులకు వివరించారు.

'పురం' టిడిపిలో అంతర్గతపోరు.!

బాలయ్య నివాసం వద్ద తెలుగు మహిళలపై మాజీ ప్రజాప్రతినిధి భర్త దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి-హిందూపురం

బీసీల పార్టీ ... అందులోనూ మహిళలకు పెద్దపీట వేసే పార్టీ అని చెప్పుకునే తెలుగుదేశం పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య అంతర్గత పోరు అధికం అవుతోంది. హిందూపురం పట్టణంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద మంగళవారం నాడు ఈ అంతర్గత పోరు బహిర్గతం అయ్యింది. ఈనెల 7వ తేదీన నారా లోకేష్ హిందూపురం పర్యటన సందర్భంగా జన సమీకరణపై ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద మంగళవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సురేంద్ర, శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నాయకులందరూ మాజీ మున్సిపల్ ఛైర్మన్లు, మాజీ కౌన్సిలర్లను కలుపుకుని వెళ్లాలని సూచించారు. దీంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మహిళా కౌన్సిలర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి మంచి కొందరు ముఖ్య నాయకులు అన్ని కార్యక్రమాలకు దూరంగా ఉన్నారన్నారు. బాలకృష్ణ వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేసి వెళ్లిపోతున్నారన్నారు. అలాంటి వారికి కాకుండా గత ఐదు సంవత్సరాలుగా అన్ని కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వైసిపి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలన్నింటినీ తాము ముందుండి చేశామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు డుమ్మాకొట్టిన నాయకులు పార్టీలో ఆధిపత్యం చెలాయిస్తున్నారని తెలుగు మహిళలు వాపోయారు. సమావేశం ముగిసిన తర్వాత పట్టణానికి చెందిన ఓ ముఖ్య మాజీ మహిళా ప్రజా ప్రతినిధి భర్త మాజీ మహిళా కౌన్సిలర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడినట్లు తెలుస్తోంది. తమ గురించి సమావేశంలో చెప్పాల్సిన అవసరం ఏముందంటూ ఏక వచనంతో ఆమెను దూషించారు. మహిళా నాయకురాలు తాను పార్టీ అభివద్ధి కోసమే చెప్పానని, వ్యక్తిగత విషయాలు ఏమీ చెప్పలేదంటూ బదులిచ్చారు. సాక్షాత్తు ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి వద్ద ఇలా బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళలపై సొంత పార్టీ నాయకుడు గొడవకు దిగడంతో చుట్టూ ఉన్న తెలుగు మహిళలు కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వే స్టేషన్ లో మంగళవారం రైలు పట్టాలను దాటుతున్న వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. జిఆర్‌పి ఎస్ఐ గోపి కుమార్ తెలిపిన వివరాలు... గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా రైల్వే ప్లాట్‌ఫాంపై 35 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి తిరుగుతుండేవాడు. ఈ వ్యక్తి ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు. మంగళవారం రైలు పట్టాల దగ్గర ఉండడంతో ఓ రైలు రావడంతో పట్టాలకు అటువైపు లేదా ఇటువైపు పోవాలో అర్థం కాని స్థితిలో రైలు కింద పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందాడని ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి : మండలం పరిధిలోని సిరివరం గ్రామానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన ఆదినారాయణ (40) తాగుడుకు బానిసై ప్రతి చిన్న విషయానికి భార్యతో, కుటుంబసభ్యులతో గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో తన కున్న ఇద్దరు కుమారుల్లో చిన్నవాడు మంగళవారం పాఠశాలకు వెళ్లకపోవటంతో భార్య, భర్త మధ్య గొడవ జరిగింది. అనంతరం చిన్న కుమారుడిని పాఠశాలలో వదిలిరావడానికి ఆదినారాయణ భార్య నరసమ్మ వెళ్లింది. తిరిగి వచ్చేలోపు ఆదినారాయణ ఇంటి తలుపులకు లోపల గడియ పెట్టుకుని ఉరివేసుకున్నాడు. తలుపులు వేసి ఉండడాన్ని గమనించిన నరసమ్మ చుట్టుపక్కల వారితో కలిసి తలుపులు పగులకొట్టింది. ఇంట్లో వంటగదిలో ఇనుప కడ్డీకి ఆదినారాయణ ఉరివేసుకుని కన్పించాడు. కిందికి దింపి చూడగా అప్పటికే ఆదినారాయణ మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎనుములపల్లిలో అగ్నిప్రమాదం

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి వామి అగ్నికి ఆహుతి అయింది. రైతు రామచంద్రకు చెందిన వరిగడ్డి వామి అగ్నికి ఆహుతి అవుతుండగా స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయగా అప్పటికే దాదాపు 75 శాతం వరిగడ్డి కాలి బూడిద అయ్యింది. రైతు రామచంద్ర మాట్లాడుతూ అసలే వేసవి కాలం కావడంతో పశుగ్రాసం దొరకడం గగనమైందన్నారు. వారం రోజుల క్రితం ఎద్దుల బండి గడ్డి రూ. 3వేల ప్రకారం ఐదు ఎడ్లబండ్ల వరిగడ్డి కొనుగోలు చేసి ఇక్కడ నిల్వ ఉంచానని చెప్పారు. ఈ ప్రమాదంతో దాదాపు 20 వేల రూపాయలు నష్టం వాటిలిందన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు రామచంద్ర కోరారు.

రొద్దం : మండలంలోని రొద్దం శ్రీ టీచ్ హై స్కూల్ సమీపంలో ఉన్న ఖాళీస్థలంలో అగ్నిప్రమాదంలో చోటు చేసుకుంది. ఖాళీస్థలంలో పెరిగిన గడ్డికి మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల ఉన్న ఇళ్లవారు ఆందోళకు గురయ్యారు. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో పెనుకొండ నుంచి ఫైర్‌ఇంజన్ అక్కడికి వచ్చేలోపు గ్రామస్తులు మంటలు ఆర్పివేశారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కొత్తచెరువు : బుక్కపట్నం చెరువులో నాగులకనుం వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మహిళ మృతదేహం నీటిలో తేలియాడుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ రాజా రమేష్ తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

తనకల్లు : మండల కేంద్రంలోని బూడిదగడ్డ వీధికి చెందిన ఎల్లంపల్లి వెంకటరమణ అనే రైతు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు పవన్ కుమార్ రెడ్డి మృతుని కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. తక్షణసాయంగా 20 వేల రూపాయలను అందించారు. మృతుని పిల్లల చదువుల కోసం సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా హసనాపురం చంటి పదివేల రూపాయలు మృతుని కుటుంబసభ్యులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, దేశాయ్ ప్రభాకర్ రెడ్డి, మహబూబ్ బాషా, పీజీ మల్లికార్జున, సరోజమ్మ, శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

ఆర్మీ ఎంపికకు నమోదు

పుట్టపర్తి అర్బన్: ఆర్మీ అగ్ని వీర్ రిక్రూట్మెంట్ 2024 - 25 కోసం రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల అభ్యర్థుల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించడం జరిగిందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ గుంటూరు కార్యాలయం కర్నల్ డైరెక్టర్ పునీత్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆర్మీ రిక్రూట్మెంట్ గుంటూరు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్ని వీరుల వివిధ కేటగిరీల రిక్రూట్మెంట్ కోసం ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈనెల 23 తో ముగుస్తుందని అన్నారు. ఉమ్మడి 13 జిల్లాలలోని ఆసక్తి గల అభ్యర్థులందరూ అగ్ని వీర్ జనరల్ డ్యూటీ, అగ్ని వీర్ టెక్నికల్, అగ్ని వీర్ ఆఫీస్ అసిస్టెంట్, అగ్ని వీర్ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్ని వీర్ ట్రేడ్స్ మ్యాన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆప్రకటనలో కోరారు.

హుండీ లెక్కింపు

లేపాక్షి : మండల కేంద్రంలోని శ్రీ దుర్గా పాపనాశశ్వర వీరభద్ర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. నాలుగునెలలకుగాను మొత్తం రూ. 5, 68, 870 రూపాయలు వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమనంద, ఈవో నరసింహ మూర్తి, సర్పంచి ఆదినారాయణ, అర్చకులు శీనస్వామి,రఘు స్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం

బత్తలపల్లి : ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకమైనదని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకుని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని తహశీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపీడీవో శివనాగప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బిఎల్‌ఎలు, సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకొని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సెక్టార్ అధికారుల పరిధిలోని పోలింగ్ స్టేషన్లు ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని సిద్ధంగా ఉండాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో మౌళిక వసతులను పరిశీలించుకోవాలని సూచించారు. అదేవిధంగా బిఎల్‌ఒలు ఓటరు నమోదు పక్రియలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఫారం-6, 7ల పైన అప్రమత్తంగా ఉండాలన్నారు ఇంటింటికీ వెళ్లి విచారణ జరిపిన తరువాతే పూర్తి నివేదికలను అందించాలన్నారు. ఈ సమావేశంలో సెక్టార్ ఆఫీసర్లు ఓబిరెడ్డి, నాగభవ్య, వరలక్ష్మి, సూపర్వైజర్లు డాక్టర్ కెవిస్ లక్ష్మీనరసింహ, రామానుజమ్మ, హరికృష్ణతో పాటు బిఎల్‌ఒలు పాల్గొన్నారు

పంటకోత ప్రయోగం

హిందూపురం: రూరల్ మండలం కొటిపి గ్రామంలో రైతు గంగప్ప రబీ సీజన్‌లో సాగు చేసిన రాగి పంటపై మంగళవారం వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. విజయ్ కుమార్, డివిజనల్ గణాంక అధికారి మల్లికార్జున, మండల వ్యసాయాధికారి ఆర్.సురేంద్ర నాయక్, మండల గణాంక అధికారి వలినాథ్ రావ్, విఆర్ఒ, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

ముదిగుబ్బ : మండలంలోని ఉప్పలపాడు, జొన్నల కొత్తపల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీవో నాగ శేషాచలం రెడ్డి మంగళవారం పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఆశా వర్కర్లకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

ధర్మవరం టౌన్ : పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు మంగళశారం ఆశా, అంగన్వాడీ వర్కర్లు ఇంటింటి పల్స్‌పోలియో కార్యక్రమం చేపట్టారు. వీరికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వారు భోజనపు ప్యాకెట్లను వాటర్ ప్యాకెట్లను అందజేశారు.సంస్థ అధ్యక్షులు తల్లం నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు జింక చిన్నప్ప చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సహాయ కార్యదర్శి మంజునాథ్, డైరెక్టర్లు చంద్రశేఖర్, సభ్యులు అన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.